## బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే చర్యలు

**సీపీ సన్‌ప్రీత్ సింగ్**



సుబేదారి, మే 8 : బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే కఠిన చర్యలు తప్పవని వరంగల్ పోలీసు కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ హెచ్చరించారు. మద్యం షాపుల ముందు మద్యం తాగుతూ ప్రజలకు ఇబ్బందులు కలుగజేస్తున్నట్లు పోలీసులకు ఫిర్యాదులు వస్తున్నాయని, ఇక నుంచి ఆయా ప్రాంతాల్లో పోలీసులు ముమ్మరంగా తనిఖీలు చేపడతారని, ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే కేసు నమోదు చేస్తామని సీపీ హెచ్చరించారు.

**ఒక్కరోజే 221మందిపై కేసు..**

బుధవారం ఒక్క రోజే కమిషనరేట్ పరిధిలో సిటీ పోలీసు యాక్ట్ కింద బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగిన 221మందిపై కేసు నమోదు చేసినట్లు సీపీ తెలిపారు. జనగామ డివిజన్‌లో 57, హనుమకొండ 42, స్టేషన్‌ఘన్‌పూర్ 40, కాజీపేట 24, వర్ధన్నపేట 24, నర్సంపేట 24, వరంగల్‌లో 10 చొప్పున కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. మద్యం షాపుల ముందు మద్యం తాగితే షాప్ యజమానిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎక్కడైనా బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే వెంటనే 100కు కాల్ చేయాలని ప్రజలకు సూచించారు.

## రైలు ఢీకొని వృద్ధుడి మృతి

కాజీపేట, మే 8 : రైలు ఢీకొని వృద్ధుడు అక్కడికక్కడే మృతి చెందిన ఘటన గురువారం జరిగింది. కాజీపేట జీఆర్పీ సీఐ నరేశ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. రైల్వే జంక్షన్ పరిధిలోని పాత వాషింగ్ సైడింగ్‌లో గుర్తు తెలియని వృద్ధుడికి రైలు తాకడంతో మృతి చెందినట్లు తెలిపారు. అతడి వయసు సుమారు 65 ఏళ్లు ఉంటుందని, వైట్ అండ్ యాష్ కలర్ చెక్స్ షర్టు, బ్లూ కలర్ గళ్ల లుంగీ ధరించి ఉన్నాడన్నారు. మృతదేహాన్ని వరంగల్ ఎంజీఎం మార్చురీలో భద్రపరుస్తామని తెలిపారు. ఎవరైనా సంబంధీకులుంటే కాజీపేట జీఆర్పీ స్టేషన్ లేదా 9848779372, 9948348070 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

## కారుణ్య నియామక ఉత్తర్వులు అందజేత

హనుమకొండ చౌరస్తా, మే 8 : కాకతీయ యూనివర్సిటీలో కారుణ్య నియామక ఉత్తర్వులను వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం అందజేశారు. విశ్వవిద్యాలయ ఆర్ట్స్ కాలేజీలో స్టోర్ కీపర్‌గా పనిచేసిన ఉద్యోగి నర్సిట్ల ఐలయ్య డిసెంబర్ 31న మృతి చెందగా, కారుణ్య నియామకంలో భాగంగా ఐలయ్య సతీమణి గోవిందు స్వరూపరాణికి కామాటీగా నియమిస్తూ కే-హబ్‌లో పోస్టింగ్ ఇచ్చారు.

## ఆయిల్‌పామ్ పంట కొనుగోలు కేంద్రాల ఏర్పాటు

శాయంపేట, మే 8 : త్వరలోనే ఆయిల్‌పామ్ పంట కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తామని పరకాల ఉద్యాన శాఖ అధికారి మధులిక అన్నారు. కొత్తగట్టు సింగారం గ్రామంలోని మాడ బుచ్చిరెడ్డి ఆయిల్ పామ్ క్షేత్రంలో ఉద్యాన శాఖ, రామ్‌చరణ్ ఆయిల్ ఇండస్ట్రీస్ ఆధ్వర్యంలో పామాయిల్ తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నీటి యాజమాన్యం, ఎరువులు డ్రిప్ నుంచి ఇచ్చే విధానంపై గురువారం అవగాహన కల్పించారు. 1993 చట్ట ప్రకారం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తారని చెప్పారు. ఈ సంవత్సరంలో ఆయిల్ పామ్ పంట దిగుబడి జిల్లాలో మొదలవుతుందని తెలిపారు. ఈ సంవత్సరం డ్రిప్ 90శాతం, 80 శాతం సబ్సిడీతో మొక్కలు ఇస్తామన్నారు. ఆయిల్‌పామ్ ఫీల్డ్ ఆఫీసర్ ప్రవీణ్ కుమార్, ఆగ్రికన్ స్టేట్ మేనేజర్ దేవేందర్‌రెడ్డి, డీలర్ రవీందర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ మెతుకు తిరుపతిరెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, సంతోష్, మల్లారెడ్డి పాల్గొన్నారు.

## కాజీపేట ఏసీపీగా ప్రశాంత్‌రెడ్డి

సుబేదారి, మే 8 : కాజీపేట ఏసీపీగా పీ ప్రశాంత్‌రెడ్డిని నియమిస్తూ డీజీపీ జితేందర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ పనిచేసిన తిరుమల్ ఇటీవల హైదరాబాద్ హైడ్రాకు బదిలీ అయ్యారు. హైదరాబాద్ సైబర్ సెక్యూరిటీలో పని చేస్తున్న ప్రశాంత్‌రెడ్డి కాజీపేటకు ట్రాన్స్‌ఫర్ చేశారు.

## బాలుడిపై లైంగిక దాడి చేసిన వ్యక్తిపై పోక్సో కేసు

సుబేదారి, మే 8 : బాలుడిపై లైంగిక దాడికి పాల్పడిన ఘటన సుబేదారి పోలీసు స్టేషన్ పరిధిలో శ్రీనివాస్ కాలనీలో జరిగింది. కాలనీకి చెందిన నాలుగో తరగతి చదువుతున్న బాలుడిపై హనుమకొండ శ్రీనగర్‌కు చెందిన ఎండీ ఫైజుల్లా లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాలుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఫైజుల్లాపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# నూతన చట్టంతో సమస్యలకు పరిష్కారం

- కలెక్టర్ ప్రావీణ్య
- మండలంలో రెవెన్యూ సదస్సుల పరిశీలన

నడికూడ, మే 8 : భూ భారతి చట్టం –2025 ద్వారా రైతుల భూములకు సంబంధించిన సమస్యలకు పరిష్కారం లభిస్తుందని కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. నడికూడ, చర్లపల్లి గ్రామాల్లో గురువారం రెవెన్యూ సదస్సులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె రైతుల భూ సమస్యలపై అడిగి తెలుసుకున్నారు. తన భూమిని దుక్కిదున్నకుండా కొందరు వ్యక్తులు బెదిరిస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని రైతు పంచనేని చొక్కారావు కలెక్టర్‌కు తెలుపగా, పోలీస్ స్టేషన్‌లో



రైతుల భూ సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్

కేసు పెట్టాలని చెప్పారు. కార్యక్రమంలో భూ భారతి స్పెషల్ ఆఫీసర్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మంగీలాల్, ఆర్డీవో నారాయణ, తహసీల్దార్ గుండాల నాగరాజు, డీఏవో సుభాషిణి, ఏవో పోరిక జైసింగ్, ఆర్ఐ సృజన్ కుమార్, శంకర్ పాల్గొన్నారు.

**ఈవీఎం గోదాం తనిఖీ..**

హనుమకొండ : ఎనుమాముల మార్కెట్ యార్డులోని ఈవీఎం గోదాంను కలెక్టర్ ప్రావీణ్య గురువారం తనిఖీ చేశారు. రాష్ట్ర ఎన్నికల సంఘానికి పంపించే పీరియాడికల్ తనిఖీ నివేదిక సందర్భంగా ఈవీఎం గిడ్డంగుల వద్ద విధులు నిర్వర్తిస్తున్న పోలీసు గార్డుల హాజరు, సమయపాలన రిజిస్టర్లను పరిశీలించారు. గార్డులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, సీసీ టీవీ కెమెరాల ద్వారా పరిశీలిస్తుండాలన్నారు. కలెక్టరేట్ ఎలక్షన్ సూపరింటెండెంట్ ప్రసాద్ ఉన్నారు.

## గొర్రెల కాపరుల సమస్యలు పరిష్కరించాలి

కమలాపూర్, మే 8 : ప్రభుత్వం వెంటనే తమ సమస్యలను పరిష్కరించాలని గొర్రెలు, మేకల పెంపకం దారుల జిల్లా ప్రధాన కార్యదర్శి కాడబోయిన లింగయ్య అన్నారు. గురువారం కమలాపూర్‌లో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు రూ.2లక్షల నగదు బదిలీ చేస్తామని హామీ ఇచ్చిందని, అధికారంలోకి వచ్చి రెండేళ్లు కావొస్తున్నా నెరవేర్చడం లేదన్నారు. పశు వైద్యశాలల్లో ఎలాంటి మందులు అందుబాటులో ఉండడం లేదన్నారు. వీధి కుక్కల దాడిలో గొర్రెలు మృత్యువాత పడుతున్నా బీమా ఇవ్వడం లేదని, గొల్ల, కురుమల సంక్షేమంపై ప్రభుత్వానికి స్పష్టమైన విధానం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. 50ఏళ్లు దాటిన వారికి రూ.5వేల పెన్షన్ ఇవ్వాలన్నారు. ప్రమాదాల్లో చనిపోయిన గొర్రెల కాపరులకు రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో వేల్పుల రమేశ్, ఎల్లబోయిన రవీందర్, కాల్వ సమ్మయ్య, బేతి రమేశ్, కాల్వ కొమురయ్య, తమ్మడబోయిన రాజయ్య, పాక కుమారస్వామి, కొడాలి అరుణ్‌కుమార్, కసరబోయిన రాజయ్య, కాల్వ చంద్రయ్య, మహేందర్, శ్రీనివాస్, వంశీ పాల్గొన్నారు.

## తలసేమియాకు ఆరోగ్యశ్రీలో వైద్య సదుపాయం

నయీంనగర్, మార్చి 8 : తలసేమియా వ్యాధిగ్రస్తులకు ఆరోగ్యశ్రీ సదుపాయం ఉందని, రెడ్‌క్రాస్ ఆవరణలో వీరి కోసం ప్రత్యేకమైన వార్డు ఉందని డీఎంహెచ్‌వో అప్పయ్య అన్నారు. ప్రపంచ తలసేమియా దినం సందర్భంగా ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి నుంచి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించి మాట్లాడారు. ఉమ్మడి జిల్లాలో దాదాపు 300మంది చిన్నారులు ఈ వ్యాధితో బాధపడుతున్నారని, ఇది ఒక జన్యు సంబంధమైన వ్యాధి అని అన్నారు. వీరికి తరచూ రక్త మార్పిడి అవసరం ఉంటుందని, నెలల వయసులోనే ఈ వ్యాధి లక్షణాలను గుర్తించొచ్చని, వీరిలో ఎదుగుదల సరిగ్గా ఉండదన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో సూపరింటెండెంట్ విజయలక్ష్మి, ప్రోగ్రాం అధికారి మదన్‌మోహన్, నిఖిల, గీత, దీప్తి, రామేశ్వరి, కౌముది, ఖాదర్ అబ్బాస్, రమేశ్, కుమార్, రాజేశ్, కమలాకర్ పాల్గొన్నారు.

## సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి

హనుమకొండ, మే 8 : కార్మికుల హక్కులను కాలరాసే నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, కార్మికుల హక్కుల కోసం మే 20న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వేల్పుల సారంగపాణి, జక్కు రాజు గౌడ్ పిలుపునిచ్చారు. గురువారం డీపీవో ఆఫీసు సీనియర్ అసిస్టెంట్ సోమేశ్వర్‌కు తెలంగాణ జీపీ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో సమ్మె నోటీసు ఇచ్చారు. జిల్లా సహాయ కార్యదర్శి సదానందం, మల్లయ్య, రాజు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## పేదలకు అన్యాయం జరిగితే చర్యలు తప్పవు

**మంత్రి పొన్నం ప్రభాకర్**

భీమదేవరపల్లి, మే 7 : ఇందిరమ్మ ఇండ్ల ఎంపికలో అన్యాయం జరిగితే చర్యలు తప్పవని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హెచ్చరించారు. గురువారం మంత్రి తన జన్మదినం సందర్భంగా కొత్తకొండ వీరభద్రస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల ఎంపిక జాబితాను డిస్‌ప్లే చేస్తున్నట్లు పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో నిరుపేదలకు మాత్రమే ఈ పథకం వర్తించాలని కోరుకుంటున్నట్లు వెల్లడించారు. గ్రామాల్లో రాజకీయాలకు అతీతంగా ఎలాంటి అవినీతి లేకుండా పారదర్శకంగా అర్హుల ఎంపిక జరుగుతుందని తెలిపారు. మండలాధ్యక్షుడు ఐలయ్య, రాజు, అదరి రవి, రమేశ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ఆపరేటర్లు పనితీరు మెరుగుపర్చుకోవాలి

**మేయర్ గుండు సుధారాణి**

వరంగల్, మే 8: కంప్యూటర్ ఆపరేటర్లు పనితీరును మెరుగుపర్చుకోవాలని మేయర్ గుండు సుధారాణి సూచించారు. కార్పొరేషన్ కార్యాలయంలో ఆమె కంప్యూటర్ ఆపరేటర్లతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బల్దియాలోని వివిధ సెక్షన్లలో విధులు నిర్వర్తిస్తున్న కంప్యూటర్ ఆపరేటర్లు కొత్త సాఫ్ట్‌వేర్ సాంకేతికతను అందిపుచ్చుకొని, దానికి అనుగుణంగా పనితీరు మార్చుకోవాలని సూచించారు. ఆపరేటర్లకు ఎలాంటి సెక్షన్ కేటాయించినా అంకితభావంతో పని చేయాలన్నారు. సమీక్షలో ఐటీ మేనేజర్ రమేశ్ పాల్గొన్నారు.

## జల్ హీ అమృత్ శిక్షణకు హాజరైన కమిషనర్

వరంగల్, మే 8: సెంటర్ ఫర్ ఎన్విరాన్‌మెంట్ అర్బన్ గవర్నెన్స్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్, ఆస్కీ సంయుక్తంగా హైదరాబాద్‌లో గురువారం నిర్వహించిన జల్ హీ శిక్షణకు గ్రేటర్ కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడే హాజరయ్యారు. రాష్ట్రంలోని పది మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు. జల్ హీ అమృత్ 2.0 లక్ష్యం, మురుగునీటిని శుద్ధి చేసి పునర్వినియోగం ద్వారా నీటి నిర్వహణ మెరుగుపర్చడం, శుద్ధి కార్మాగారాల నిర్వహణను సమర్థవంతంగా చేయడం తదితర అంశాలపై శిక్షణలో వివరించారు. అనంతరం హైదరాబాద్ మెట్రో వాటర్ సప్లయ్ అండ్ సీవరేజ్ బోర్డు నిర్వహిస్తున్న మురుగు నీటి శుద్ధీకరణ పద్ధతులను క్షేత్రస్థాయిలో ఆమె పరిశీలించారు.



ర్యాలీ నిర్వహిస్తున్న లోటస్ కాలనీ వాసులు

## సైనికులకు సంఘీభావంగా ర్యాలీ

హనుమకొండ, మే 8 : ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో భారత సైన్యానికి సంఘీభావంగా లోటస్ కాలనీవాసులు గురువారం రాత్రి ర్యాలీ నిర్వహించారు. ఉగ్రవాదుల దాడిని తిప్పి కొట్టడానికి భారత ప్రభుత్వం చేసిన గొప్ప కార్యక్రమాన్ని పొగుడుతూ యువత, మహిళలు, వృద్ధులు ర్యాలీలో పాల్గొన్నారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా, అలాగే బార్డర్‌లో పనిచేస్తున్న సైనికులకు సలాం, జై జవాన్.. జై భారత్.. మాతాకీ జై అంటూ నినాదాలు చేశారు. ర్యాలీలో కాలనీకి చెందిన నరెండ్ల శ్రీనివాస్‌రెడ్డి, సంకెపల్లి దివాకర్‌రెడ్డి, బోనగిరి రాములు, శరత్, ధర్వంత్, వెంకట్, దశరథరాంరెడ్డి, మహిళలు పాల్గొన్నారు.

## కార్మికుల హక్కుల సాధనకు వారధిగా పని చేస్తా

**బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్**



కార్మికులతో మాట్లాడుతున్న వినయ్‌భాస్కర్

హసన్‌పర్తి, మే 8 : కార్మికులకు దక్కాల్సిన హక్కుల కల్పనలో వారధిగా పని చేస్తానని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్య వినయ్ భాస్కర్ అన్నారు. కార్మికుల మాసోత్సవాల సందర్భంగా ఎల్లాపూర్‌లోని ఎల్‌పీసీ కంపెనీ కార్మికులతో ఆయన గురువారం రాత్రి సమావేశం నిర్వహించారు. ముందుగా కార్మికులు కార్మిక దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కంపెనీ స్థాపన కోసం స్థానిక ప్రజలతో కలిసి కృషి చేశానన్నారు. 1993లో స్థాపించిన కంపెనీ కాలక్రమేణా నష్టాల బాటలో నడిచిందన్నారు. 2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత మళ్లీ కంపెనీ తెరిపించేందుకు కృషి చేసినట్లు చెప్పారు. కార్మికులతో తనకు సత్సంబంధాలు ఉన్నాయన్నారు. న్యాయంగా కార్మికులకు దక్కాల్సిన హక్కుల కోసం కృషి చేస్తానని చెప్పారు. కార్మికుల డిమాండ్‌లను నెరవేర్చేందుకు యాజమాన్యంతో మాట్లాడుతానని వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కంపెనీ జీఎం గణేశ్, ఇన్‌చార్జి సిన్హా, కార్మికులు రవి, తిరుపతి, రమణాచారి, భిక్షపతి, సురేందర్, సదానందం తదితరులు పాల్గొన్నారు.

## ఫీజుల నియంత్రణ చట్టం అమలు చేయాలని వినతి

హనుమకొండ, మే 8 : ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలల్లో ఫీజుల నియంత్రణ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఊట్కూరి ప్రణీత్‌గౌడ్, భాషబోయిన సంతోష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ వైవీ గణేశ్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జీవో నంబర్ 42 ప్రకారం అర్బన్, రూరల్ ప్రాంతాల్లో ప్రభుత్వ నిర్ణయించిన ప్రకారమే ప్రైవేట్ పాఠశాలలు ఫీజులు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు కుక్కల కుమార్, వేల్పుల చరణ్, జిల్లా సమితి సభ్యులు శ్రీపతి వినయ్, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

**తుర్కకుంటను ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలి..**

ఐనవోలు మండలం పున్నేలు గ్రామంలోని బాబాయ్ కుంట (తురకకుంట)ను రియల్టర్ల నుంచి కాపాడాలని విముక్త చిరుతల కచ్చి(వీసీకే) నాయకులు డిమాండ్ చేస్తూ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చెరిపల్లి ఆనంద్ ఆధ్వర్యంలో జిల్లా రెవెన్యూ అధికారి వైవీ గణేశ్‌కు ఫిర్యాదు చేశారు. వందల ఏండ్లుగా వ్యవసాయానికి ఉపయోగిస్తున్న బాబాయ్ కుంటను రియల్టర్లు ఆక్రమించి ప్లాట్లు చేసి అమ్ముతున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో హనుమకొండ జిల్లా వైదిక పార్టీ అధ్యక్షుడు కన్నాల రవి, జిల్లా నాయకుడు సుమన్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## పీఏసీఎస్ గోదాములు, భవన నిర్మాణ పనులు ప్రారంభం



నీరుకుళ్ల పీఏసీఎస్ గోదాములు, భవనానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

ఆత్మకూరు, మే 8 : రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. గురువారం పెంచికల్‌పేట పీఏసీఎస్ ఆధ్వర్యంలో నీరుకుళ్ల గ్రామంలో రూ.90 లక్షలతో గోదాములు, ప్రాథమిక సహకార సంఘం భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా డీసీసీబీ డైరెక్టర్, పీఏసీఎస్ చైర్మన్ కంది శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రైతులకు వ్యవసాయమే ప్రధాన జీవనాధారమని, ఇలాంటి కీలకమైన రంగానికి సేవలందించడంలో పీఏసీఎస్‌లదే ముఖ్యపాత్ర అన్నారు. రైతులు గోదాములను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమావేశంలో డీసీవో సంజీవరెడ్డి, నోడల్ అధికారి రాధిక, వైస్ చైర్మన్ పోతరాజు రాజు, డైరెక్టర్లు ఉడుత రాజేందర్, పిట్టల సూరయ్య, అర్షం అహల్య, కోడూరి రమేశ్, తోట చంద్రశేఖర్, సీఈవో ఓదెల లక్ష్మయ్య పాల్గొన్నారు.



క్యాడెట్లకు శిక్షణ ఇస్తున్న కమాండెంట్లు

## కొనసాగుతున్న ఎన్‌సీసీ శిక్షణ తరగతులు

హసన్‌పర్తి, మే 8 : మండలంలోని గ్రీన్‌వుడ్ హైస్కూల్‌లో ఈ నెల ఒకటో తేదీ నుంచి 10(టీ)బెటాలియన్ ఎన్‌సీసీ శిక్షణ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. గురువారం క్యాడెట్లను సాయుధ దళాల వైపు ప్రేరేపించే కార్యకలాపాలు నిర్వహించారు. మ్యాప్ రీడింగ్, టెంట్ పిచింగ్, ఎలక్ట్రికల్, సాఫ్ట్‌స్కిల్ డిబేట్, గ్రూప్ చర్చల వంటి అంశాలపై వివరించారు. కార్యక్రమంలో క్యాంప్ కమాండెంట్ కర్నల్ సెంథిల్ రామదురై, డిప్యూటీ కమాండెంట్, సుబేదార్ మేజర్ జయరామ్‌సింగ్, జేసీవోలు ప్రేమ్ చౌరాసియా, బెటాలియన్ హవల్దార్ సందీప్, లెఫ్టినెంట్ విష్ణువర్ధన్‌రెడ్డి, ఫస్ట్ ఆఫీసర్ రాధాకృష్ణన్ పాల్గొన్నారు.

## ప్రతి పాఠశాలలో 'బడిబాట' నిర్వహించాలి

ఎల్కతుర్తి, మే 8 : బడిబాట కార్యక్రమం ప్రతి పాఠశాలలో నిర్వహించాలని ఎంపీడీవో విజయ్‌కుమార్ తెలిపారు. గురువారం ఎల్కతుర్తి మండల పరిషత్ కార్యాలయంలో బడిబాట, ఉల్లాస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. గ్రామంలో సమావేశాలు నిర్వహించుకొని వలంటీర్స్, అభ్యాసకులను గుర్తించి వంద శాతం అక్షరాస్యత సాధించే దిశగా కృషి చేయాలని చెప్పారు. బడి బయట ఉన్న విద్యార్థులను గుర్తించి వంద శాతం నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో సత్యనారాయణ, ఏపీఎం రవీందర్ పాల్గొన్నారు.

## రైతు కూలీలతో ఆటలాడుతున్న పాలక వర్గాలపై ఉద్యమించాలి

హసన్‌పర్తి, మే 8 : రైతు కూలీలతో ఆటలాడుతున్న పాలక వర్గాలపై ఉద్యమించాలని ఆల్ ఇండియా ప్రోగ్రెస్ ఫోరం రాష్ట్ర సమితి సభ్యుడు నేదునూరి రాజమౌళి గురువారం పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయ రంగాన్ని సమీక్షించి సుస్థిర అభివృద్ధి కోసం సాగు భూమి లేని నిరుపేద దళిత బహుజనులకు పంపిణీ చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఈ నెల 26, 27వ తేదీల్లో హసన్‌పర్తిలో నిర్వహించే సీపీఎంసభలను విజయవంతం చేయాలన్నారు. అనంతరం మండలంలోని జయగిరిలో సీపీఎం నూతన కమిటీ ఎన్నుకున్నారు. గ్రామ అధ్యక్షుడిగా గడ్డం చంద్రమౌళి, సహాయ కార్యదర్శిగా నన్నెబోయిన జంపయ్య, పిట్టల రవి ఎన్నికయ్యారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి మెట్టు శ్యాంసుందర్ పాల్గొన్నారు.

## 9 నుంచి క్రికెట్ వేసవి శిక్షణ శిబిరాలు



శ్రీనివాస్

హనుమకొండ చౌరస్తా, మే 8 : హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ సౌజన్యంతో వరంగల్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 6 సెంటర్లలో ఈ నెల 9 నుంచి జూన్ 7వ తేదీ వరకు ఉచిత క్రికెట్ క్యాంప్‌లు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ కార్యదర్శి చాగంటి శ్రీనివాస్ తెలిపారు. ప్రతి క్రికెట్ సెంటర్‌లో ఉదయం, సాయంత్రం జరిగే కోచింగ్‌లో పాల్గొనాలనుకునే క్రీడాకారులు ఈ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వరంగల్ (తోట రాము 9966559414)–కాకతీయ మెడికల్ కాలేజీ గ్రౌండ్ వరంగల్, మహబూబాబాద్ (అజయ సారథి 986647 9666) కాంక్రీట్ క్రీడా మైదానం మహబూబాబాద్, భూపాలపల్లి (సిరిమల్లె శ్రీనివాస్ 8897805683) సింగరేణి స్టేడియం భూపాలపల్లి, పరకాల (అభినవ వినయ్ 9666206662) ప్రభుత్వ జూనియర్ కాలేజీ గ్రౌండ్ పరకాల, ములుగు (సందీప్‌నేత్ర 9030130727) తంగేడు క్రీడా మైదానం ములుగు, జనగామ (దిలీప్ రెడ్డి 99590 00003) జిల్లాలోని యశ్వంతపూర్‌లోని సెజ్ పాఠశాల మైదానంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అండర్ –14,16,19,23 విభాగాల్లో స్థానిక కోచింగ్ సెంటర్‌లో తమ పేరు నమోదు చేసుకోవచ్చని తెలిపారు.

## జూడో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా కైలాశ్‌యాదవ్



హనుమకొండ చౌరస్తా, మే 8 : తెలంగాణ జూడో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఖిలావరంగల్ మధ్యకోటకు చెందిన బైరబోయిన కైలాస్‌యాదవ్ ఎన్నికయ్యారు. ఫిబ్రవరిలో హైదరాబాద్ నాంపల్లిలో జూడో అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ ఎన్నికలు నిర్వహించగా, అంతర్జాతీయ క్రీడాపోటీలు కొనసాగుతున్న నేపథ్యంలో ఫలితాలను నిలిపివేశారు. గురువారం తెలంగాణతో పాటు మరో 15 రాష్ట్రాల నూతన కమిటీ జాబితాను జూడో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అడ్మినిస్ట్రేటర్, అలహాబాద్ రిటైర్డ్ జడ్జి పంకజ్ సఖ్వి ప్రకటించారు. తెలంగాణ జూడో అసోసియేషన్ నూతన కార్యవర్గంలో ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన పలువురు పదవులను దక్కించుకున్నారు. రాష్ట్ర జాయింట్ సెక్రటరీలుగా డీ సంతోష్, బీ సాయిరాంయాదవ్, టెక్నికల్ కమిటీ చైర్మన్‌గా సీహెచ్ రాము, టెక్నికల్ కమిటీ సెక్రటరీగా నాగరాజు ఎన్నికయ్యారు. వీరందరూ నాలుగేళ్లపాటు ఈ పదవిలో కొనసాగుతారన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో జూడో సంఘం నూతన కమిటీలను వేయడంతో పాటు జూడో క్రీడాభ్యున్నతి, క్రీడాకారుల సంక్షేమం కోసం పాటుపడతానని కైలాస్‌యాదవ్ అన్నారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 27 మందికి జరిమానా

సుబేదారి, మే 8 : వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో గురువారం డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన 27 మందికి జరిమానా విధించినట్లు హనుమకొండ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సీతారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. వీరిలో నలుగురికి రెండు రోజుల జైలు శిక్ష, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపిన 8 మందికి రూ.4వేల జరిమానా విధించారని పేర్కొన్నారు.

## ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలి

హనుమకొండ చౌరస్తా, మే 8 : ఆపరేషన్ కగార్‌ను నిలిపివేసి శాంతి చర్చలు కొనసాగించాలని పౌరహక్కుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నారాయణరావు డిమాండ్ చేశారు. గురువారం హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. ఈ నెల 11న హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో జరిగే ఉమ్మడి వరంగల్ జిల్లా 3వ మహాసభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రజా ఉద్యమాలపై జరుగుతున్న అణచివేతను ప్రశ్నించడమే పౌరహక్కుల సంఘం ప్రధాన లక్ష్యమన్నారు. అనంతరం మహాసభల కరపత్రాలను ఆవిష్కరించారు. సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు రమేశ్‌చందర్, ప్రధాన కార్యదర్శి సారంగపాణి, భారత్ బచావో జిల్లా అధ్యక్షుడు వెంగల్‌రెడ్డి, శాంత్, కుమారస్వామి, కోడెం కుమారస్వామి పాల్గొన్నారు.

## ట్రైబల్ వర్సిటీ లోగో డిజైన్ కమిటీలో నారాయణ

హనుమకొండ చౌరస్తా, మే 8 : కాకతీయ విశ్వవిద్యాలయ జంతుశాస్త్ర విభాగ ఆచార్యుడు ఈసం నారాయణకు ములుగు జిల్లాలోని జాకారం గ్రామంలో కేంద్ర ప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేసిన 'సమ్మక్క సారక్క సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ' విశ్వవిద్యాలయ లోగో తయారు చేసే 'లోగో డిజైన్ కమిటీ'లో చోటు దక్కింది. సమ్మక్క సారక్క సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ వీసీ వైఎల్ శ్రీనివాస్ నుంచి ఉత్తర్వులు అందుకున్నట్లు నారాయణ తెలిపారు. ఈ సందర్భంగా నారాయణను కేయూ వీసీ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ రామచంద్రం అభినందించారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హనుమకొండ, మే 8 : హనుమకొండ టౌన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆపరేషన్స్ డీఈ సాంబారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. పెద్దమ్మగడ్డ సబ్ స్టేషన్ పరిధిలో ఉదయం 8 నుంచి 10 గంటల వరకు ప్రభుత్వ ఐటీఐ, ములుగు రోడ్డు, బీఎస్ఎన్ఎల్ వెనుక సైడ్, ఇండస్ట్రియల్ ఏరియాలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, ప్రజలు సహకరించాలని కోరారు.

## ఉపాధ్యాయులకు శిక్షణ సమర్థవంతంగా జరగాలి

హనుమకొండ చౌరస్తా, మే 8 : ఉపాధ్యాయులకు శిక్షణ సమర్థవంతంగా జరగాల ని ఎస్సీఈఆర్టీ తెలంగాణ డైరెక్టర్ గాజర్ల రమేశ్ అన్నారు. ఫాతిమానగర్‌లోని బాలవికాస శిక్షణా కేంద్రంలో రిసోర్స్‌పర్సన్లకు నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి శిక్షణ కార్యక్రమాన్ని సందర్శించారు. పాఠశాల విద్యాశాఖలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ఉపాధ్యాయులకు సరైన శిక్షణ అందించాలని కోరారు. ఉపాధ్యాయులు పాఠశాలలో విద్యార్థుల నమోదును పెంచడం, నాణ్యమైన విద్య అందించడం, వినూత్న కార్యక్రమాల ద్వారా బోధించడం, ఇంటరాక్టివ్ ఫ్లాట్ పానల్ బోర్డుల ద్వారా ఐసీటీని ఉపయోగిస్తూ బోధించడం వంటి అంశాలపై దృష్టి పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో వరంగల్ పాఠశాల విద్య ఆర్జేడీ సత్యనారాయణ రెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి వాసంతి, క్వాలిటీ కో ఆర్డినేటర్ శ్రీనివాస్, ఎస్సీఈఆర్టీ కోర్సు కో ఆర్డినేటర్లు ఎల్లయ్య, గణపతి పాల్గొన్నారు.

## కాజీపేట జీఆర్పీ సీఐగా నరేశ్‌కుమార్ బాధ్యతలు



కాజీపేట, మే 8 : కాజీపేట జీఆర్పీ స్టేషన్ సీఐగా వడ్డే నరేశ్ కుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో కాజీపేట జీఆర్పీ సీఐగా విధులు నిర్వర్తించిన రామ్మూర్తిని పోలీస్ అధికారులు ఇటీవల మామునూరు పీటీసీ సీఐగా బదిలీ చేశారు. నరేశ్‌కుమార్ 2007లో ఎస్సైగా పోలీస్ శాఖలో చేరారు. ఆయన వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఎస్‌బీ, టాస్క్‌ఫోర్స్, ట్రాఫిక్, పీటీసీలో ఎస్సై, సీఐగా విధులు నిర్వర్తించారు.

## గుండెపోటుతో సీనియర్ రిపోర్టర్ మృతి



శంకర్ (ఫైల్)

కాజీపేట, మే 8 : పట్టణానికి చెందిన సీనియర్ రిపోర్టర్ వెంపటి శంకర్ (58) గుండెపోటుతో మృతి చెందాడు. శంకర్ ఇరవై ఏళ్లుగా పలు దినపత్రికల్లో పని చేశారు. కాగా, పలువురు పాత్రికేయులు కాజీపేట చౌరస్తాలో శంకర్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించి, మౌనం పాటించారు. ఐజేయూ, టీయూడబ్ల్యూజే 143, ప్రెస్ క్లబ్ నాయకులు శంకర్ పార్థివదేహం వద్ద నివాళులర్పించారు.

## టెస్ట్ బెంచ్ ప్రారంభం

హనుమకొండ, మే 8 : ఎన్పీడీసీఎల్ హనుమకొండ సర్కిల్ కార్యాలయంలోని ఎల్‌టీ మీటర్ ల్యాబ్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన టెస్ట్ బెంచ్‌ను ఇన్‌చార్జి డైరెక్టర్ మధుసూదన్ గురువారం ప్రారంభించారు. టెస్ట్ బెంచ్‌తో అన్ని రకాల సింగిల్ ఫేజ్, త్రీ ఫేజ్, సీటీ, హెచ్‌టీ మీటర్లను కచ్చితత్వంతో టెస్ట్ చేయొచ్చని, ఏక కాలంలో 20 మీటర్లను పరీక్షించొచ్చన్నారు. కార్యక్రమంలో హనుమకొండ సర్కిల్ ఎస్ఈ మధుసూదన్ రావు, ఎంఆర్‌టీ డీఈ దర్శన్ కుమార్, టెక్నికల్ డీఈ విజేందర్‌రెడ్డి, ఏడీఈ తిరుపతి రెడ్డి పాల్గొన్నారు.

## సీపీ ఆఫీస్‌లో పోలీసు అమరులకు నివాళి

**కుటుంబ సభ్యులను ఓదార్చిన మంత్రి సీతక్క, డీజీపీ జితేందర్, ఎమ్మెల్యేలు**

సుబేదారి, మే 8 : తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు గ్రేహౌండ్స్ పోలీసులు సందీప్, శ్రీధర్, పవన్ కల్యాణ్ గురువారం మృతిచెందారు. వీరి మృతదేహాలను పోస్టుమార్టం అనంతరం హనుమకొండలోని వరంగల్ పోలీసు కమిషనరేట్‌కు తీసుకొచ్చారు. మంత్రి సీతక్క, డీజీపీ జితేందర్, ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాశ్‌రెడ్డి, నాయిని రాజేందర్‌రెడ్డి, నాగరాజు, మేయర్ గుండు సుధారాణి తెలంగాణ స్టేట్ గ్రేహౌండ్స్ విభాగం అడిషనల్ డీజీపీ స్టీఫెన్ రవీంద్ర, వరంగల్ సీపీ సన్‌ప్రీత్ సింగ్, ములుగు ఎస్పీ శబరీశ్ మృతదేహాలపై పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించి, కుటుంబసభ్యులను ఓదార్చారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

**పాస్‌పోర్ట్ పోయినది**

★నేను, **బసికె విజయ్‌కుమార్** S/o **బసికె రత్నం** నా యొక్క పాస్‌పోర్ట్ 2025 ఏప్రిల్ 20న లేబర్ కాలనీ నుండి ఖిలా వరంగల్‌కు వెళుతుండగా దారిలో ఎక్కడో పడిపోయినది. నాపాస్‌పోర్ట్ నెం. **J5092952** గల పాస్‌పోర్టు ఎవరికి అయిన దొరికితే నా ఫోన్ నెం. **9849776722** లలో సంప్రదించగలరని ప్రార్థన.
NTW-000

**CHANGE OF NAME**

I, MOHAMMED KHAJA MOINUDDIN S/o MOHAMMED ABDUL KHADER R/o H.No. 11-23-2007, LB Nagar, Near ZIA Masjid, Warangal, district,-506002, T.G. My name is Changed from MOHAMMED ABDUL KHAJA MOINUDDIN S/o MOHAMMED ABDUL KHADER to MOHAMMED KHAJA MOINUDDIN S/o MOHAMMED ABDUL KHADER for all purposes.

**గోదాం కావలెను**

★పెద్దవంగరలోని మన గ్రోమోర్ సెంటర్‌కు పర్మినెంట్ గోదాం కావలెను. 1500–2000 Sq.fts గలది పెద్దవంగర మేన్ రోడ్ పరిధిలో కావలెను. సంప్ర: 9121044072, 91001007590.
NTW-000

**CHANGE OF NAME**

★I, MOHAMMED MUJEEBUDDIN S/o MOHAMMED ANWARUDDIN R/o H.No.11-22-830/1, Madeena Street, L.B.Nagar, Warangal City & Dist., have changed my name from MOHAMMED ABDUL MUJEEB to MOHAMMED MUJEEBUDDIN S/o MOHAMMED ANWARUDDIN for all future Purposes.
NTW-17627

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

**CHANGE OF NAME**

★I, MAMIDALA ANNAPURNA (New Name) previously called MAMIDALA ANNAPOOORNA (Old Name), W/o MAMIDALA PRAKASH, R/o. H.No: 1-9-965, Postal colony, Near Adalath, Hanamkonda District,-5060002, T.G solemnly declare.
NTW-17628

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే

4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే

ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే

ప్రకటనల విభాగం : 9182777552

HANAMKONDA 9182777563

WARANAGAL 9182777556

JAYASHANKAR BHUPALPALLY - 9182777135

MULUGU - 9182777135

MAHABUBABAD - 9182777557

JANGAON - 9182777565